క్లుప్తంగా

బస్ షెల్టర్‌పై పోస్టర్లు.. రూ.3వేలు జరిమానా

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని ఇమాంపేట గ్రామంలో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన బస్‌షెల్టర్‌పై జిల్లా కేంద్రానికి చెందిన పాఠశాల, కళాశాల యాజమాన్యం పోస్టర్లు, ఫ్లెక్సీలు అంటించారు. నూతనంగా నిర్మించిన బస్‌షెల్టర్‌పై అంటించిన పోస్టర్లు, ఫ్లెక్సీలను ఎంపీడీఓ శ్రీనివాసరావు శనివారం పరిశీలించి సదరు యాజమాన్యానికి రూ. 3వేలు జరిమానా వేశారు. ఆ నగదును గ్రామ పంచాయతీకి జమ చేశారు. పోస్టర్లను, ఫ్లెక్సీలను తొలగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాముల ఉపేందర్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట మండల బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాన్ని పట్టణ పరిధిలోని సీతారామ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సాయంత్రం 5గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సభను జయప్రదం చేయాలి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో ఈ నెల 30న జరిగే సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు పోలెబోయిన యాగయ్య రెండో వర్ధంతి సభ, స్థూపావిష్కరణను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, న్యూడెమోక్రసీ సబ్‌డివిజన్ నాయకుడు పోలెబోయిన పెద్దలింగయ్య కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సభకు ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వక్కంతుల కోటేశ్వర్‌రావు, రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని చెప్పారు. సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ అందించాలి



మాట్లాడుతున్న కడియం కుమార్

నాగారం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేద ప్రజలకు రేషన్‌కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు వెంటనే అందించాలని సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, దళితులందరికీ దళిత బంధు, డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు సీపీఎం నాయకులు గుడుపూరి వెంకటేశ్వర్లు, కండె భిక్షం, నిమ్మల మారయ్య, పద్మ, స్వరూప, తంగెల్ల వెంకన్న తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు వైద్యపరీక్షలు



కోదూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్లు

అర్వపల్లి : పిల్లలకు పోషకాహార లోపం లేకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌బీఎస్‌కే వైద్యులు డాక్టర్ కె. గౌతం, డాక్టర్ కె.స్పందన కోరారు. శనివారం కోదూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. రక్తహీనత, ఎదుగుదల, పుట్టుకతో వచ్చే లోపాలపై తల్లులకు అవగాహన కల్పించారు. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ సతీష్, ఏఎన్ఎం గీత, అంగన్‌వాడీ టీచర్ నంద సునీత, ఆయా కె. వీరమ్మ, ఆశా కార్యకర్త జి.యల్లమ్మ, తల్లులు రేణుక, దివ్య, శ్రీమతి, నాగమ్మ పాల్గొన్నారు.

వాసవీక్లబ్ సేవలు అభినందనీయం

కోదాడరూరల్ : సామాజిక సేవలో వాసవీక్లబ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం పట్టణంలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పలు చోట్ల సిమెంట్ బల్లలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఇమ్మడి సతీష్‌బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, రాయపుడి వెంకటనారాయణ, డాక్టర్ బ్రహ్మం, వంటిపులి శ్రీనివాస్, ప్రసాద్, గీత, విజయశేఖర్, సత్యనారాయణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నంబర్ లేకున్నా.. లైసెన్స్ పొందకున్నా

- రహదారులపై ఇసుక ట్రాక్టర్ల యజమానుల ఇష్టారాజ్యం
- మైనర్లు, లైసెన్స్ లేని వారే డ్రైవర్లు.. చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



తిరుమలగిరిలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ ట్రాక్టర్ నడుపుతున్న యువకుడు



తిరుమలగిరిలో నంబర్ ప్లేట్ లేని ఇసుక ట్రాక్టర్

తిరుమలగిరి : తుంగతుర్తి నియోజవర్గంలోని చాలా ప్రాంతాల్లో వాహనదారులు తమ ఇష్టానుసారంగా నంబర్ ప్లేట్ లేకుండానే వాహనాలను రోడ్లపై తిప్పుతున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో లైసెన్సులు లేనివారు కూడా వాహనాలను రోడ్లపై నిర్లక్ష్యంగా నడుపుతున్నారు. ఫలితంగా ప్రతిరోజు ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తుంగతుర్తి నియోజకవర్గంలో తిరుమలగిరి మండలం తాటిపాముల, నందాపురం, అనంతారం, నాగారం మండలం ఈటూరు, వర్ధమానుకోట, పేరబోయినగూడెం, జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి, వడ్డెరిగూడెం గుండా బిక్కేరు, మూసీ వాగులు ప్రవహిస్తున్నాయి. అయితే ఈ వాగుల్లో ఉన్న ఇసుకను ప్రతిరోజు ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు పగలు, రాత్రి అనే తేడా లేకుండా తరలిస్తున్నారు. కానీ ఆ ట్రాక్టర్లను నడిపే డ్రైవర్లంతా మైనర్లే కావడం గమనార్హం. ఏ ఒక్కరు కూడా డ్రైవింగ్ లైసెన్సులు లేకుండానే ట్రాక్టర్లు నడుపుతున్నారు. దీనికి తోడు అదనంగా ట్రిప్పులు తోలాలనే తపనతో వేగంగా ట్రాక్టర్లను తోలుతున్నారు. కారణంగా ఏదో ఒక చోట ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల్లో పలువురు చనిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు మైనర్ డ్రైవర్ల స్థానంలో లైసెన్సులు ఉన్న డ్రైవర్లకు డబ్బులు ఇచ్చి మేనేజ్ చేస్తున్నారు.

> **స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం**
>
> మైనర్లు వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తాం. మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై కూడా కేసులు నమోదవుతాయి. త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి.
>
> – వెంకటయ్య, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట

నంబర్ ప్లేట్లు లేకుండానే..

ట్రాక్టర్లకు నంబర్ ప్లేట్లు లేకుండానే వ్యాపారులు ఇసుకను తరలిస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రం ఏదో ఒక నంబర్‌తో, లైసెన్సు ఉన్న డ్రైవర్లలో మేనేజ్ చేయిస్తున్నారు. గతంలో ఇలాంటి సంఘటనలు అనేకం జరిగినా అధికారులు మాత్రం తమకు ఏ మాత్రం పట్టింపులేనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా రవాణా, పోలీస్ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. లైసెన్సులు లేని డ్రైవర్లు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- ఈ నెల 30న సంతోషిమాత ఆలయంలో ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవాలయ కమిటీ సభ్యులు



సూర్యాపేటలోని సంతోషిమాత ఆలయం

భానుపురి : సూర్యాపేట పట్టణంలోని శ్రీసంతోషిమాత ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. పాత బస్టాండ్ రోడ్డులోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం పక్కనే ఉన్న సంతోషిమాత ఆలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రత్యేక పూజలతో పాటు ప్రతి ఏటా దేవాలయ ప్రతిష్ఠ రోజున బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా ఈ నెల 30న పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 30న మంగళవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించనున్నారు. దేవాలయ ప్రధాన అర్చకులు ఇటువంటి శివరామకృష్ణ శర్మ, భట్టారం వంశీకృష్ణశర్మలు ఉదయం 7 గంటల 31 నిమిషాలకు కలశ స్థాపనతో పూజలు ప్రారంభించి శ్రీసంతోషిమాత, శ్రీసత్యసాంబశివుడు, శ్రీలక్ష్మీగణపతి, క్షేత్రపాలక ఆంజనేయస్వామి, సంతాన నాగదేవతలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు. అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించనున్నారు. ఉదయం 10 గంటలకు మల్లెల పుష్పార్చన, పసుపు కొమ్ముల పూజ, గాజుల పూజతో పాటు రుద్ర హోమం గణపతి హోమం, లలిత హోమం నిర్వహించనున్నారు. మహా పూర్ణాహుతి నిర్వహించిన అనంతరం సంతోషిమాత అమ్మవారికి మహా సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించి బ్రహ్మోత్సవం ముగింపు పలకనున్నారు. భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం కూడా నిర్వహించనున్నామని దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశంగుప్త, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్‌లు పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న కడియం రామచంద్రయ్య

తిరుమలగిరి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య కోరారు. శనివారం తిరుమలగిరిలో ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి నుంచి మండల పార్టీ అధ్యక్షుల వరకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అధ్యక్షులు హనుమంతు యాదవ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు పేరాల పూలమ్మ, జిల్లా కార్యదర్శి ఎం.యాదగిరి, మూలం వెంకట్‌రెడ్డి, సంతోష్‌నాయక్, వెంకన్న, సోమయ్య, శ్రీనివాస్, అశోక్, సుజాత, మల్లయ్య, వీరన్న, మధు, సోమిరెడ్డి, సోమయ్య పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

నాగారం : భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ మండల స్థాయి కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ బలోపేతానికి బూత్‌స్థాయి నుంచి మండల స్థాయి నాయకుల వరకు తమ శక్తి మేరకు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, వాటి ప్రయోజనాలను ఇంటింటికీ తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పేరాల పూలమ్మ, మండల అధ్యక్షుడు మొల్కపురి చిరంజీవి, ప్రధాన కార్యదర్శి ఆలకుంట్ల బాలక్రిష్ణ, నాయకులు నాగు వెంకన్న, గిరిప్రసాద్, సురేష్, అనంతుల సోమేష్, సైదులు, మంగదుడ్ల రమేష్, పేరాల వెంకన్న, అర్జున్, శిరస్సు వెంకన్న, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం



నూతనకల్ : చిల్పకుంట్లలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏపూరి సోమన్న



మద్దిరాల : పోలుమల్లలో ఆర్థికసాయం అందజేస్తున్న ఏపూరి సోమన్న

నూతనకల్ : ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న అన్నారు. శనివారం మండల పరిధిలోని చిల్పకుంట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ ధాన్యాన్ని కొనుగోలు చేసి తరలించడంలో విఫలమయ్యారని అన్నారు. అకాల వర్షానికి ధాన్యం రంగుమారిందని మిల్లర్లు అధిక మొత్తంలో కోత విధించడంతో రైతులు భారీగా నష్టపోతున్నారని తెలిపారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతులు కల్లాల్లోనే ఉండే పరిస్థితి దాపురించిందని అన్నారు. నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలులో జరిగిన అవినీతిపై ప్రశ్నిస్తున్న వారిపై ఎమ్మెల్యే కిశోర్ అనుచరులు దాడులకు పాల్పడటం సమంజసం కాదని తెలిపారు. వెంటనే ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌టీపీ నాయకుడు ఇరుగు శ్రీనివాస్‌ను పరామర్శించి రూ. 5వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు ముత్యం రవిగౌడ్, మేకల నాగన్న, సాంబయ్య, వెలుగు అంజయ్య, చందా వెంకన్న, గాజుల సురేందర్, ఏపూరి యాకన్న, చింతకుంట్ల పరమేష్, దిలీప్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీపీ అండగా ఉంటుంది

మద్దిరాల : పోలుమల్ల గ్రామానికి చెందిన ఆకుల లక్ష్మణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏపూరి సోమన్న శనివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.10వేల ఆర్థికసాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలకుంట్ల మహేష్, చింతకుంట్ల పరమేష్, ఏపూరి యాకయ్య, దిలీప్ నాయుడు, రాము, రిషి, ప్రేమ్, ఉపేందర్ పాల్గొన్నారు.

గోపాలమిత్రల సమస్యలు పరిష్కరించాలి

అర్వపల్లి : గోపాల మిత్రల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని గోపాలమిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆల్దాసు లింగయ్య అన్నారు. శనివారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. గోపాల మిత్రలకు పెంచిన వేతనాలను అమలు చేయాలని కోరారు. ఉద్యోగభద్రత కల్పించాలని, వయస్సు పైబడిన వారిని ఓఎస్‌లుగా గుర్తించాలన్నారు.

నేడు వీరన్న వర్ధంతి సభ

తుంగతుర్తి : ములుగు జిల్లాలో ఆదివారం జరిగే మారోజు వీరన్న 24వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీయూఎస్‌ఐ రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కులవర్గ జమిలి పోరాటాల సిద్ధాంతకర్త, ఇండియా మానవతావాది మారోజు వీరన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మారోజు వీరన్న వర్ధంతి సభకు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

సీపీఎం నాయకులపై పోలీసుల దాడి సరికాదు

అర్వపల్లి : మోతె మండలం విభళాపురం గ్రామంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులపై పోలీసులు దాడి చేయడం సరికాదని ఆ పార్టీ మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లబ్ధిదారులు, మహిళలను పోలీసులు ఈడ్చుకుంటూ వెళ్లి దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. దాడిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎంసీపీఐయూ ఖండన..

విభళాపురంలో సీపీఎం జిల్లా నాయకుడు మట్టిపెల్లి సైదులుతో పాటు మహిళలపై పోలీసులు దాడిచేయడం సరైంది కాదని ఎంసీపీఐయూ డివిజన్ ఇన్‌చార్జ్ ఈదురు వీరపాపయ్య అన్నారు. నిరుపేదలందరికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

మోతె ఎస్‌ఐని విధుల నుంచి తొలగించాలి

తిరుమలగిరి : వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సైదులుపై దాడి చేసిన మోతె ఎస్‌ఐని వెంటనే విధుల నుంచి తొలగించాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య డిమాండ్ చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం పేదలకు న్యాయం కోసం పోరాడుతుందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యవసాయ కార్మిక సంఘం తగిన గుణపాఠం చెబుతుందని అన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

నూతనకల్ : ఎమ్మెల్యే గాదరి కిశోర్ అఖిలపక్ష నాయకులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా నూతనకల్, మద్దిరాల మండలాల్లో ఆదివారం నిర్వహించే బంద్‌ను విజయవంతం చేయాలని అఖిపక్ష నాయకులు కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. దళితబంధులో అవినీతిని ప్రశ్నించిన వారి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు అడ్వకేట్ యుగేంధర్‌పై దాడికి పాల్పడ్డారని అన్నారు. దళిత సంఘాల నాయకులకు, రాజకీయ పక్షాల నాయకులకు ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలని, వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. బంద్‌కు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్, బీజేపీ అధ్యక్షులు నాగం సుధాకర్‌రెడ్డి, మద్ది సంజీవరెడ్డి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పాల్వాయి పరశురాం, బొబ్బిలి వెంకన్న, ఇరుగు కిరణ్, పాల్వాయి పరశురాములు, పాల్వాయి జగదీష్ పాల్గొన్నారు.

బీసీలను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న తన్నీరు రాంప్రభు

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలను పట్టించుకోవడంలేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు అన్నారు. శనివారం ఆయన తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తులు చేసుకునే వారికి రూ.10 లక్షల ఆర్థికసాయం అందజేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలు బీసీలకు 60 సీట్లు కేటాయించాలని అన్నారు. ఈ సమావేశంలో కాసాని శ్యాంయాదవ్, మహేష్ గౌడ్, ఉపేందర్ గౌడ్, బ్రహ్మం, లింగయ్య, ప్రశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

చివ్వెంల : అతి వేగంగా వస్తున్న బైక్ అదుపు తప్పి లారీని ఢీ కొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని గుంపుల గ్రామ శివారులో హైదరాబాద్–విజయవాడ రహదారిపై శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం మాధవరం గ్రామానికి చెందిన పిండి గోపిరెడ్డి శనివారం బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుంపుల గ్రామ శివారులోకి రాగానే ముందుగా వెళ్తున్న లారీని బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గోపిరెడ్డి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ విష్ణుమూర్తి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సర్వే చేశారు.. పరిహారం మరిచారు

- అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు అందని పరిహారం
- జాజిరెడ్డిగూడెం మండలంలో 6వేల ఎకరాల్లో పంట నష్టం
- వెంటనే పరిహారం అందించాలని కోరుతున్న అన్నదాతలు



వేల్పుచెర్ల సమీపంలో సర్వే చేస్తున్న వ్యవసాయ సిబ్బంది(ఫైల్)

అర్వపల్లి : అకాల, వడగళ్ల వర్షంతో జిల్లాలో అత్యధికంగా జాజిరెడ్డిగూడెం మండలంలో పంటలకు నష్టం వాటిల్లింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ వడగళ్ల మూలంగా పంటలకు తీవ్ర నష్టం జరిగి రైతులు కోలుకోలేని దెబ్బతిన్నారు. అయితే కలెక్టర్ వెంటనే ఐదుగురు జిల్లా అధికారులతో ఐదు బృందాలను ఏర్పాటు చేసి మండల వ్యాప్తంగా సర్వే చేయించారు. కలెక్టర్ వెంకట్రావ్‌తో పాటు సీఈఓ, డీఏఓ ఇతర జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు సర్వేను పరిశీలించారు. ఆయా బృందాలు గ్రామాలవారీగా తిరిగి పంట నష్టం వివరాలను సేకరించగా మండల వ్యవసాయ అధికారులు నష్టం నివేదికను ప్రభుత్వానికి పంపారు. అయితే రైతులు నష్టపరిహారం కోసం ఎదురు చూస్తున్నారు.

జాజిరెడ్డిగూడెం మండలంలో..

ఏప్రిల్ 22, 23 తేదీలలో జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా పడిన అకాల, వడగళ్ల వర్షాలకు సుమారు 6 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఇందులో 200 ఎకరాల వరకు మామిడి, నిమ్మ ఇతర పంటలకు నష్టం జరగ్గా మిగిలిన 5,800 ఎకరాల్లో వరి పంటలకు నష్టం ఏర్పడింది. వరి పైర్లు వడగళ్ల వర్షంతో పూర్తిగా నేలవారి గింజలు పూర్తిగా రాలిపోయాయి. అలాగే 50 వరకు ఇళ్లు దెబ్బతిన్నాయి. అయితే పంటలకు కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లింది. కాగా ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తామని ప్రకటించింది. కానీ ఇంతవరకు నష్టపరిహారం చెల్లింపు ప్రారంభంకాలేదు. పంట నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

> **నాలుగు ఎకరాల పంట పూర్తిగా నేలపాలైంది**
>
> 
>
> యాసంగిలో సాగుచేసిన నాలుగు ఎకరాల వరి పంట రెండు, మూడు రోజుల్లో చేతి కొచ్చే సమయంలో వడగళ్ల వర్షంతో పూర్తిగా నేలపాలైంది. వరిచేనులో ధాన్యం గింజలు మొత్తం రాలిపోయాయి. దీంతో పెట్టుబడి కూడా వెళ్లని పరిస్థితి ఏర్పడింది.
>
> – నల్లగుంట్ల రవికుమార్, రైతు, కాసర్లపహాడ్

> **నష్టపరిహారం వెంటనే చెల్లించాలి**
>
> 
>
> యాసంగిలో 12 ఎకరాల్లో వరి, మిర్చి సాగుచేశాను. కానీ పంట చేతికొచ్చే సమయంలోనే ఈదురు గాలులు, అకాల, వడగళ్ల వర్షంతో పంట పూర్తిగా పాడైంది. దీని మూలంగా రూ.10 లక్షల పైగానే నష్టపోయాను. నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి.
>
> – వజ్జె శ్రీనివాస్ రైతు, రామన్నగూడెం

‘ప్రతిపక్ష పార్టీల ఫ్లెక్సీలకే ఆంక్షలు వర్తిస్తాయా’

భానుపురి : పట్టణంలో ప్రతిపక్ష పార్టీల సభలు, సమావేశాలు ఉన్నప్పుడు మాత్రమే ఫ్లెక్సీలపై ఆంక్షలు వర్తిస్తాయా అని తెలంగాణ జన సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు గట్ల రమాశంకర్, జిల్లా అధ్యక్షుడు మాంద్ర మల్లయ్య యాదవ్ శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. సూర్యాపేటలో తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్లీనరీ జరగనున్న నేపథ్యంలో పార్టీ ప్రచారాన్ని అడ్డుకునేందుకు ఆంక్షలతో కూడిన నోటీసులు ఇవ్వడం తగదని పేర్కొన్నారు. పట్టణంలో అధికార పార్టీ నాయకులు అడ్డగోలుగా ఫ్లెక్సీలు కట్టినప్పుడు మున్సిపల్ కమిషనర్‌కు జీవోలు, చట్టాలు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. అందరికీ ఒకే రకమైన హక్కులు ఉండాలని, అధికార పార్టీకి ఒక తీరుగా, ఉద్యమ పార్టీకి ఒకతీరుగా ఉండొద్దని తెలిపారు. ఇప్పటికైనా ప్లీనరీని ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు అధికారులు సహకరించాలని కోరారు.

బాలికలపై లింగవివక్ష చూపొద్దు



మాట్లాడుతున్న వైద్యాధికారి సమతారాణి

తిరుమలగిరి : బాలికలపై లింగ వివక్ష చూపొద్దని పల్లె దవాఖాన వైద్యాధికారి సమతారాణి అన్నారు. లింగ వివక్ష, బాల్య వివాహాల నిర్మూలనపై తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో మార్పు సొసైటీ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోరెళ్ల విప్లవ్‌కుమార్, ఏఎన్ఎం లలిత, మాధవి, పంచాయతీ కార్యదర్శి యాకూబ్‌రెడ్డి, అశ్విని, మంజుల, హేమలత, భద్ర, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

తిరుమలగిరి : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తిరుమలగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్ కోరారు. శనివారం తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సందీప్ నేత, విఘ్నేష్, యాకూబ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడెపుకుంట తండా వాసికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న వెంకటేశ్వర్లు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని గూడెపుకుంట తండావాసి భూక్య వెంకటేశ్వర్లు తమిళనాడులో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. తండాకు చెందిన భూక్య వెంకటేశ్వర్లు తమిళనాడులో ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీలో కథా రచయితగా రాసిన కథలను గుర్తించి యూనివర్సిటీ వారు డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. తమిళనాడు యూనివర్సిటీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కేపే మోనోకరన్, డాక్టర్ జైహరిదాస్, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ అరుణకుమార్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు.

గడ్డివాములు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తుంగతుర్తి : గడ్డివాములు దగ్ధమైన సంఘటన తుంగతుర్తి శివారులో శనివారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన రైతులు షేక్.మీరాసాబ్, షేక్.యాకూబ్, షేక్.చిన్నమీరాసాబ్, షేక్. చిన్నయాకూబ్‌లు ఇటీవల వరికోతలు పూర్తవడంతో తమ వ్యవసాయ క్షేత్రాల్లో గడ్డిని వాములుగా పేర్చుకున్నారు. కాగా ఓ రైతు తన వ్యవసాయ క్షేత్రంలో వరికొయ్యలకు నిప్పుపెట్టగా ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు గడ్డివాములకు అంటుకుని పూర్తిగా దగ్ధమయ్యాయి. అలాగే పలువురు రైతుల పైపులు, స్టార్టర్లు, వైర్లు కాలిపోయాయి. రైతులు ఫైరింజన్‌కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి మంటలను చల్లార్చారు. ఈ ఘటనలో సుమారు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తమకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత

మద్దిరాల : కుక్కడం గ్రామానికి చెందిన మరికంటి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. దీంతో గ్రామ సర్పంచ్ గుండ్ల కొమరయ్య శనివారం మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట ఉపసర్పంచ్ బీసు పూలమ్మ వీరన్న, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మద్దెల రాములు, వార్డు సభ్యులు బొమ్మెర వెంకన్న, బీసు రవి, రాంబాబు, వెన్నెమల ప్రవీణ్, నిర్మల ఉన్నారు.